క్లుప్తంగా

రీసర్వే రికార్డులను పకడ్బం దీగా నమోదు చేయండి



భూముల రీ సర్వేపై వీర్వోలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వే రికార్డులను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. మంగళవారం ఆయన వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వే సహాయకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

మొక్కలు నాటిన కుడా చైర్మన్

కోడుమూరు రూరల్: పట్టణంలోని వెంకటగిరి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వినాయకుల నిమజ్జన బావిని కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. వినాయక నిమజ్జన కమిటీ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సర్పంచు భాగ్యరత్న, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు.

సన్మానం



విజయలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

కల్లూరు: సుష్మాస్వరాజ్ స్త్రీశక్తి సమ్మాన్ –2023 అవార్డు అందుకున్న డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల కరస్పాండెంట్ విజయలక్ష్మిని విద్యా సంస్థల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి మంగళవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భద్రత, క్రమశిక్షణ, తల్లిదండ్రుల పట్ల బాధ్యతలను గుర్తు చేస్తూ బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దుతున్నందుకు గానూ తనకు జాతీయ స్థాయి అవార్డు లభించిందని అవార్డు గ్రహీత విజయలక్ష్మి తెలిపారు.

'సుంకేసుల'లో 0.990 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల జలాశయంలో 0.990 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు మంగళవారం తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందన్నారు.


పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

గూడూరు: కొత్త బస్టాండ్ సమీపంలో జీనియస్ గ్లోబల్ పాఠశాలను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ విద్య నేర్చు కోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగాధర రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఎంఈఓ నాగారాజు, ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్: మండలంలోని మెరుగుదొడ్డి గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే డా.సుధాకర్ ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు, సమస్యలను తెలుసుకుంటారన్నారు.

ప్లేట్లు, దుప్పట్ల పంపిణీ



అంగన్‌వాడీ విద్యార్థులకు ప్లేట్లు, దప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో అద్భుతంగా రాణిస్తున్న రిటైర్డ్ మిలిటరీ అధికారులు బాలకృష్ణ యాదవ్, శాంసన్‌లను పసుపల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ కే.శేషారెడ్డి, సీఈఓ మురళీధర్‌చౌదరి, పరదీప్ పాస్ఫేట్ కంపెనీ (పీపీఎల్) ప్రతినిధులు మంగళవారం ఘనంగా సత్కరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు ప్లేట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరదీప్ కంపెనీ చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ చరణ్ బసు పాల్గొన్నారు.

17న జిల్లా ఆవిర్భావ వేడుకలు

కర్నూలు కల్చరల్: ఈనెల 17న సాయంత్రం 5.30 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో కర్నూలు జిల్లా ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోళ్ల నారాయణ, టి.శ్రీనివాసరెడ్డి మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 'కర్నూలు జిల్లా వైభవం' పుస్తకావిష్కరణ, కర్నూలు ప్రముఖులకు సత్కారం ఉంటుందన్నారు.



సి.బెళగల్ జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ శేషఫణి, పోలీస్‌లు



సి.బెళగల్ మండలం ముడుమాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బతుకమ్మ



గూడూరులో జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ శివశంకర్ నాయక్, తదితరులు

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేశారు. స్వేచ్ఛా వాయువులు అందించిన స్వాతంత్య్ర సమరయోధులకు ఘన నివాళులర్పించారు. దేశభక్తిగీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతీయ నాయకుల వేశధారణలతో విద్యార్థులు మెరిసిపోయారు. దేశానికి స్వాతంత్రం రావడానికి ప్రాణ త్యాగాలు చేసిన ప్రముఖుల గురించి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు విశదీకరించారు. వారి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.





కోడుమూరు బాలికల హైస్కూల్లో జెండా ఎగురవేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి , పోలకల్ జెడ్పీ స్కూల్లో జెండా వందనం చేస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా మహాత్మగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చి ప్రజలకు సుపరిపాలన అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికల హైస్కూల్, నాగార్జున పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. వేడుకల సందర్భంగా నిర్వహించని వ్యాసరచన, ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. తహసీల్దా ర్ కార్యాలయంలో తహసీల్దార్ జయన్న, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న, పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీధర్, ఆయా పాఠశాలల్లో పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జెండావిష్కరించారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి తహసీల్దార్ శేషఫణి, డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణమూర్తి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించి కార్యాలయం వద్ద జాతీయ జెండా ను ఎగురవేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ బొంతల మునెప్ప, సర్పంచ్ పాండురంగన్న, జెడ్పీ పాఠశాలలో ఎంఈఓ ఆదామ్ బాషా జెండాలను ఆవిష్కరించారు. ముడుమాల జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు సర్పంచ్ బతుకమ్మ దుస్తులను పంపిణీ చేశారు. సి.బెళగల్ పీహెచ్‌సీలో డాక్ట ర్లు మిథున్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సునిత మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్‌తో పాటు క్రిష్ణదొడ్డి రోడ్డులో ఆటో యూనియన్ సభ్యులు ఏర్పాటు చేసిన ఉత్స వాల్లో ఎస్‌ఐ పీరయ్య పాల్గొని జెండాను ఆవిష్కరించారు.

గూడూరు: పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కార్యాలయాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పవన్‌కుమార్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివశంకర్ నాయక్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సునీతమ్మ, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎస్ఆర్ శివకుమార్ మూడు రంగుల జెండాను ఎగుర వేశారు.



కోడుమూరు పోలీస్‌స్టేషన్లో జెండావిష్కరించి వందనంగావిస్తున్న సీఐ శ్రీధర్



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ బోయ శారద, అధికారులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఎరగవేస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి



అంబేద్కర్ నగర్‌లోని ప్రగతి పాఠశాలలో జెండా ఎగురవేస్తున్న ఎంపీటీసీ రమానాథ్‌రెడ్డి



పాణ్యం ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో ..

కల్లూరు: స్థానిక 35వ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మాజీ సైనికులు కార్యాలయం , పెన్షర్ల అసోసియేషన్ల కార్యాలయం, 21వ వార్డు డాక్టర్స్ కాలనీ పార్కు, 41వ వార్డులోని ఆటో నగర్ వద్ద జరిగిన స్వాతంత్య్ర దినోత్సవాల్లో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు అరుణ, మాధురి, శ్వేతా రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు. 29వ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోయ శారద జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ జీవీ రమణమూర్తి పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉలిందకొండ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ నల్లప్ప జెండాను ఆవిష్కరించారు. కల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ జెండాను ఎగరవేశారు.

పాణ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ ఉసేన్‌బీ, పంచాయతీ కార్యాలయం సర్పంచ్ మేకల పల్లవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలో ప్రిన్సిపాల్ విజయభారతి జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఫారెస్టు రేంజ్ కార్యాలయం వద్ద అధికారి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ చంద్రహాస్ పాల్గొన్నారు. కొండజూటూరు గ్రామంలో సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి జెండాను ఆవిష్కరించారు.

గడివేముల: తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ విమలా వసుంధరదేవి తమ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌ఐ సుబ్బరాయుడు, ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద గ్రామ సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్పెషల్ అధికారి రుబీనా ఆధ్వర్యంలో విద్యార్థినులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ శైలజ జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాజరాజేశ్వరి పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఓర్వకల్లు: మండలంలోని పలు గ్రామాల్లో మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచు తోట అనూష జెండాను ఎగురవేశారు. లొద్దిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి పాల్గొని, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఎంపీపీ మెయిన్ స్కూల్ వద్ద హెచ్‌ఎం దుర్గాప్రసాద్, పీఎంసీ చైర్మన్ వెంకటస్వామి విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.



కర్నూలు నగర పాలక కార్యాలయ ప్రాంగణంలో స్వాతంత్య్ర సమర యోధుల కుటుంబాలను సత్కరిస్తున్న మేయర్ బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్



జెండా ఆవిష్కరిస్తున్న కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ



స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా రాజరాజేశ్వరి పాఠశాల విద్యార్థుల ర్యాలీ



ఎంపీడీఓ కార్యాలయం వద్ద వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం



గడివేముల ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, అధికారులు



సీఈఓ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న సీఈఓ కబీర్ బాషా



గడివేములలో విద్యార్థుల ప్రదర్శన

మేయర్ క్యాంపు కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు

కల్లూరు: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మంగళవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ బీవై రామయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మేయర్ రామయ్య నగర ప్రజలకు 77వ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరణ చేసి వందనం చేశారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

–కల్లూరు అర్బన్ పరిధిలోని ఎల్కూర్ బంగ్లాస్‌లో ఉన్న నారాయణ పాఠశాలలో కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్వేతారెడ్డి, ఏజీఎం రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మేయర్ రామయ్య.

హౌసింగ్ చిరుద్యోగికి రాష్ట్ర స్థాయి పురస్కారం

కర్నూలు(అర్బన్): జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా (అకౌంట్స్) విధులు నిర్వహిస్తున్న ఏ వెంకటేశ్వర్లు అందించిన సేవలకు రాష్ట్ర స్థాయి పురస్కారం లభించింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లుకు కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషా ప్రశంసా పత్రాన్ని అందించారు.



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న వెంకటేశ్వర్లు

బాలుడికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసుల తెలిపారు. గ్రామ సమీపాన నిర్వహిస్తున్న ఇటుకల ఫ్యాక్టరీలో పని చేస్తున్న బీహార్‌కు చెందిన దంపతులు పని చేస్తున్నారు. వారి కుమారుడు ఎనిమిదేళ్ల గౌరబ్‌కుమార్ రోడ్డు దాటేక్రమంలో కర్నూలు నుంచి నంద్యాల వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించారు.

మణిపూర్ బాధితులకు అండగా నిలుద్దాం

కర్నూలు (టౌన్): మణిపూర్‌లో రెండు తెగల మధ్య గొడవల వల్ల వేలాది మంది ఇబ్బందులు పడుతున్నారని గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చి పాస్టర్ పి.కృపాదానం వెల్లడించారు. మంగళవారం మాట్లాడుతూ మణిపూర్ బాధితుల కోసం సీబీఎస్ఈ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, సోప్స్, డైపర్స్, శానిటరీ నాప్‌కిన్స్‌లను అందజేయాలని కోరారు. ఈనెల 20వ తేదీలోపు ఆర్ఎస్ రోడ్డులో ఏర్పాటు చేసిన కేంద్రంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో గిప్సన్ చర్చి కార్యదర్శి మాధవరావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తీరిన సమస్య!

- గడపగడపకు మనప్రభుత్వ కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన సమస్యకు పరిష్కారం
- బూజునూరులో 11కేవీ వైర్ల షిఫ్టింగ్ పనులు పూర్తి
- ఇళ్లపై వెళ్లిన విద్యుత్ వైర్లను మార్చిన సిబ్బంది
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గ్రాస్తులు

గడివేముల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలిస్తుంది. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా చేపట్టి న ఈ కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన సమస్యలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పరిష్కారం చూపుతున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బూజునూరు గ్రామస్తులు ఇళ్లపై వెళ్తున్న విద్యుత్ లైన్ మార్చాలని విన్నవించారు. దాదాపు నలభైఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని... చాలా ప్రమాదాలు జరిగాయని ప్రజలు ఎమ్మెల్యే ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వివరించారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరవతో విద్యుత్ లైన్ సమస్య పరిష్కారమైంది.



బూజునూరు గ్రామంలో 11కేవీ వైర్లను షిఫ్టింగ్ చేస్తున్న విద్యుత్ సిబ్బంది



ఇంటిపైన ఉన్న 11కేవీ వైర్లు (ఫైల్)

చేయి ఎత్తితే ప్రామాదాన్ని తాకినట్లే....

బూజునూరు గ్రామంలో ఇళ్లపై 11కేవీ విద్యుత్ తీగలు వెళ్లాయి. ఇళ్లపైకి ఎక్కినప్పుడు చేయి పైకి ఎత్తితే ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిన పరిస్థితి ఉండేది. ఎంతో మంది ఈ ప్రమాదానికి గురయ్యారు కూడా. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపుల వచ్చాయంటే భయం రెండింతలు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనే భయాందోళనతో బిక్కుబిక్కుమంటుంటారు కాలనీవాసులు. దాదాపు గత 40 ఏళ్లుగా ఇదే పరిస్థితి. గత ప్రభుత్వంలో పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా కాలనీ వాసులకు నిట్టూర్పు తప్పలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఈ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు మూకుమ్మడిగా తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన కాటసాని లైన్‌ను మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అధికారులు రూ.3 లక్షలతో ఎస్టిమేషన్ వేయగా ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన 11 కేవీ షిప్టింగ్ పనులు మంగళవారం పూర్తయ్యాయి. ఎన్నో ఏళ్ల సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని కృతజ్ఞతలు తెలుపుతున్నారు బూజునూరు గ్రామస్తులు.

ఎమ్మెల్యే కాటసాని సాయం మరువం



కొన్నేళ్లుగా 11 కేవీ విద్యుత్ వైర్లు ఇళ్లపై చేతులకు అందెంత ఎత్తులో ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నా ఎవరు పట్టించుకోలేదు. మా కాలనీలో వైర్లు మరీ కిందకు వేలాడుతున్నాయి. గాలులు వీచినప్పుడు భయంభయంగా ఉంటుంది. గతంలో మా అమ్మకు విద్యుత్‌షాక్‌కు గురైంది. ఇళ్లపై ప్రమాదకరంగా మారిన వైర్లను తొలగించాలని అధికారులకు విన్నవించినా స్పదన లేదు. వెంటనే స్పందించి పరిష్కారం చూపిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సాయం మరువం.

– మహబూబ్ బాషా, బూజునూరు గ్రామం

పెద్ద సమస్య పరిష్కారం అయ్యింది



నేను పుట్టినప్పటి నుంచి మా కాలనీలో 11కేవీ విద్యుత్ తీగలు ఇళ్లపై నుంచి వెళ్తున్నాయి. వర్షకాలంలో గాలులకు ఏ ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో భయంగా ఉండేది. గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు. మా గ్రామానికి ఇదో పెద్ద సమస్యగా మిగిపోయింది. గడపగడపకు మనప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కాటసానికి సమస్య విన్నవించగా సానుకూలంగా స్పందించారు. పెద్ద సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు.

–షేక్ ఉశేన్‌బాషా, బూజునూరు గ్రామం